
సాక్షి
అనకాపల్లి
గురువారం । 22 । మే । 2025



ఎన్‌సీసీ క్యాడెట్లకు నేవీ శిక్షణ

అల్లిపురం: విశాఖ ఏవీఎన్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు నేవీ అధికారులు శిక్షణ ఇచ్చారు. రైఫిల్ మాటింగ్ నేర్పారు.



సాగరతీరంలో రామ మందిరం

విశాఖ నగరవాసులకు సరికొత్త అనుభూతిని పంచేందుకు అయోధ్య రామ మందిరం నమూనా సిద్ధమయింది. 8లో



ఘనంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవల్లో భాగంగా నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుల బదిలీల కోలాహలం

విశాఖ విద్య: విద్యాశాఖలో బదిలీల కోలాహలం మొదలైంది. బుధవారం నుంచి బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో, ఇందుకనుగుణంగా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. తొలుత గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పనిచేస్తున్న వారు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరిచారు. గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులు 93 ఖాళీగా ఉన్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి ఎస్.ప్రేమ్ కుమార్ తెలిపారు. క్లియర్ వేకెన్సీ 46 పోస్టులు ఉండగా, రేషనలైజేషన్‌లో భాగంగా 24 పోస్టులు ఖాళీ చూపించారు. ఫారిన్ సర్వీసుపై వెళ్లిన వారి ఖాళీలు 2 ఉన్నాయి. ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. కంపల్సరీ ట్రాన్స్‌ఫర్ అయ్యే జాబితాలో 15 మంది లెక్క తేలారు. వీరు గురువారం సాయంత్రం 5 గంటల్లోగా బదిలీ కోసమని దరఖాస్తు చేసుకోవాలి. కంపల్సరీ ట్రాన్స్‌ఫర్ జాబితాలో ఉన్న వారెవరైనా బదిలీ చేయనట్లయితే, వారికి చివరిగా మిగిలిన ఖాళీల్లో పోస్టింగ్ కేటాయించనున్నారు. ఇదిలా ఉండగా, బాలికల పాఠశాలలో 50 ఏళ్ల లోపు వయసున్న వారిని కూడా బదిలీ చేస్తున్నారు. ఇలా ఆరుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు గుర్తించి, వారి జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వీరు కూడా తప్పనిసరిగా బదిలీ కోసమని దరఖాస్తు చేసుకోవాలి. విశాఖలోని సీతమ్మధారలోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు డీఈవో తెలిపారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని స్కూళ్లలో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల వారీగా ఖాళీల జాబితాలను సిద్ధం చేస్తున్నామన్నారు.

జూలో ఉత్సాహంగా సమ్మర్ క్యాంప్



సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న చిన్నారులతో జూ అధికారులు

ఆరిలోవ (విశాఖ): ఇందిరాగాంధీ జూ పార్కులో బుధవారం పాఠశాల పిల్లలకు సమ్మర్ క్యాంప్ ప్రారంభమైంది. జూ పార్కుతో పాటు జీవీఎంసీ, వైల్డ్‌లైఫ్ కన్సర్వేషన్ త్రూ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్, గ్రీన్ పాజ్, యూత్ కన్సర్వేషన్ యాక్షన్ నెట్‌వర్క్ సంయుక్తంగా ఈ క్యాంప్ నిర్వహిస్తున్నాయి. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ శిబిరంలో నగరంలో పలు పాఠశాలలకు చెందిన సుమారు 30 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి రోజు వారికి పక్షుల వీక్షణ నిర్వహించారు. జూలో ఉన్న పక్షులతోపాటు లోపల సహజ వాతావరణంలో చెట్లపై తిరిగే వివిధ రకాల పక్షులను పిల్లలు తిలకించారు. వాటి గురించి జూ ఎడ్యుకేషన్ సిబ్బంది చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ పిల్లలకు వన్యప్రాణులపై అవగాహన కల్పించడానికి సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వన్యప్రాణులు, వాటి జీవిత విశేషాలు, ఆహార అలవాట్లు, పర్యావరణానికి వాటి ఉపయోగం తదితర అంశాల గురించి పిల్లలకు అవగాహన కల్పిస్తామన్నారు.

సైబర్.. టెర్రర్

అచ్యుతాపురం అడ్డాగా అసాంఘిక కార్యకలాపాలు

- రెండో రోజు సాఫ్ట్‌వేర్ డీ-కోడ్ చేయడానికి ప్రత్యేక బృందాలు
- సైబర్ నేరస్తులపై కొనసాగుతున్న విచారణ
- అనుమానితులను గుర్తిస్తున్న పోలీసు అధికారులు
- భయాందోళనలో స్థానిక ప్రజలు



భోగాపురంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన అపార్ట్‌మెంట్

సాక్షి, అనకాపల్లి/అచ్యుతాపురం రూరల్: పారిశ్రామికీకరణతో ప్రగతి బాట పట్టిన ప్రాంతమది.. ఇప్పుడు సైబర్ టెర్రర్‌తో కలవరపడుతోంది. అచ్యుతాపురానికి సమీపంలోని భోగాపురంలో మంగళవారం రాత్రి పలు అపార్ట్‌మెంట్లు, వాటిలోని ఫ్లాట్లపై పోలీసు దాడి ఈ ప్రాంతంలో కలకలం సృష్టించింది. ఆన్‌లైన్ ట్రాపింగ్‌కు పాల్పడిన సైబర్ నేరగాళ్లను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నట్టు సమాచారం. నిందితులు వాడుతున్న సాఫ్ట్‌వేర్ డీ-కోడ్ చేసే ప్రయత్నంలో సంబంధిత శాఖలు నిమగ్నమై ఉన్నాయి. అచ్యుతాపురం కేంద్రంగా ఎన్నాళ్లుగా ఈ ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయి..? వీరి ద్వారా ఆన్‌లైన్ ట్రాపింగ్‌లో మోసపోయిన వారెందరు..? తదితర కోణాల్లో పోలీసులు అత్యంత రహస్యంగా దర్యాప్తు చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ డీ-కోడ్ అయితేనే గానీ వివరాలు చెప్పలేమని పోలీసు అధికారులు తెలిపారు.

100 మందికి పైగా సైబర్ నేరగాళ్లు

మంగళవారం రాత్రి భోగాపురం సమీపంలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న 100 మందికిపైగా సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో మూడొంతుల మంది పారిపోయారు. పోలీసుల అదుపులో ఉన్న కొందరు సైబర్ నేరగాళ్ల నుంచి సమాచారం రాబడుతున్నారు. బుధవారం ఉదయం కూడా కొందర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. భోగాపురం సమీపంలో ఉన్న పవన్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లోని మొత్తం 40 ఫ్లాట్లలో వీరు సైబర్ నేరాలు నడిపిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇందులో పాలుపంచుకుంటున్న వారు సమీపంలోని వివిధ అపార్ట్‌మెంట్లలో నివాసం ఉంటున్నట్టు తెలుస్తోంది. వీరు చాలా గోప్యత పాటించేవారని, వంటలు చేసుకోవడానికి ఉపయోగించే గ్యాస్, పాలు, ఏమైనా పార్శిళ్లు వచ్చినా కింద పెట్టేసి వెళ్లిపోవాలే తప్ప.. వారుండే ఫ్లాట్లలోకి వెళ్లనిచ్చేవారు కాదని చెబుతున్నారు. శని, ఆది వారాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా వాడుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. వారు ఆరు నెలలుగా ఇక్కడ ఉన్నట్టు తెలుస్తోంది.

స్థానిక పోలీస్ అధికారి సెలవు రోజునే దాడులు

అచ్యుతాపురం సెజ్‌లో జరిగే ఆన్‌లైన్ ట్రాప్ అంతా స్థానిక పోలీసులకు తెలిసే జరుగుతుందా..? కొన్ని నెలలుగా ఈ మోసాలు జరుగుతున్నా పోలీసులు ఎందుకు రైడ్ చేయలేదు..? ప్రజల మనసుల్లో మెదులుతున్న ప్రశ్నలివి. పోలీస్ ఉన్నతాధికారులకు సైతం ఈ సందేహాలు వచ్చినట్టు తెలుస్తోంది. గతంలో పేకాట డెన్‌లపై, ఆన్‌లైన్ కోడిపందేలతో పాటు పలు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా.. స్థానిక పోలీస్ అధికారి, సిబ్బంది దాడులు జరిపేవారు కాదని తెలుస్తోంది. దాడులు జరిపినా ముందుగా సమాచారం లీక్ చేసేవారని ఉన్నతాధికారులు గుర్తించారు. అందుకే జిల్లా పోలీసు ఉన్నతాధికారే రంగంలోకి దిగి స్థానికంగా మరో డివిజన్ స్థాయి పోలీస్ అధికారితో కలిసి రైడింగ్‌కు వ్యూహరచన చేసినట్టు చెబుతున్నారు. స్థానిక పోలీసు అధికారి సెలవు రోజున ఈ దాడులు జరగడం గమనార్హం.

స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి బ్రేక్

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి గురువారం నుంచి జరిగే కౌన్సెలింగ్‌కు బ్రేక్ పడింది. ముందు అనుకున్న ప్రకారం ఈ నెల 22, 23 తేదీల్లో అభ్యర్థులకు కౌన్సెలింగ్, పోస్టింగులు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమం కూడా చేపట్టాలని భావించారు. అయితే కౌన్సెలింగ్, పోస్టింగ్ వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని, సాధారణ బదిలీలు పూర్తి అయిన తర్వాత కౌన్సెలింగ్ నిర్వహించాలని పలు సంఘాలు ఒత్తిడి చేశాయి. ఈ మేరకు ప్రభుత్వం నుంచి కూడా ఆదేశాలు రావడంతో నేటి నుంచి జరగాల్సిన కౌన్సెలింగ్ వాయిదా వేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి తెలిపారు. మొత్తం 124 పోస్టులకు గానూ 115 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు.

వర్షాలతో నువ్వు పంట అతలాకుతలం

అనకాపల్లి: మునగపాక మండలం కొండకర్ల ఆవ దిగువ ప్రాంతాలైన హరిపాలెం, పరిసర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో నువ్వు పంట ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దెబ్బతిందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ శాస్త్ర విభాగం అధికారి వి.గౌరీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారం క్రితం కోసి కుప్పలు పెట్టిన నువ్వు పంట తడిసిపోయిందని పేర్కొన్నారు. రైతులు నువ్వు కుప్పలపై టార్పాలిన్లు వేసి వర్షం నుంచి కాపాడాలని, తడిచిన పంటను పొడి ప్రాంతంలో ఆరబెట్టాలని ఆమె సూచించారు.

ఆనంద యోగం.. ఆరోగ్య భాగ్యం



యోగాసనాలు చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు

అనకాపల్లి: ఆరోగ్యమే గొప్ప సంపద అని, యోగాతో దానిని సాధించి ఆనందంగా ఉండవచ్చని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. ఆయుష్మాన్ భారత్ ఆధ్వర్యంలో బొజ్జన్నకొండ వద్ద ఆమె బుధవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'విశ్వమంతా యోగాతో ఆరోగ్యం' అనే నినాదంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జూన్ 21వ తేదీన నిర్వహించుకుంటున్నామని, ఆ నేపథ్యంలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించామని ఆమె చెప్పారు. ఇందులో పాల్గొనే వారి కోసం ప్రభుత్వం యోగాంధ్ర యాప్ రూపొందించిందని, యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. యోగాంధ్ర ప్రారంభ కార్యక్రమంలో అయిదు వందల మంది ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని, వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరు రోజులో కొంత సమయం వ్యాయామానికి కేటాయించాలన్నారు. యోగా లైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె.బాబూరావు, డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఇన్‌చార్జి ఆర్డీవో వై.శ్రీనివాసరావు, జిల్లా ఆయూష్ మెడికల్ అధికారి డా.శిరీష, అనకాపల్లి మెడికల్ అధికారి కె.లావణ్య, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, యోగా లైఫ్ ఫౌండేషన్ యోగా శిక్షకులు, సాధకులు, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం ప్రధానార్చకుడు కన్నుమూత



సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ప్రధానార్చకుడు ఇరగవరపు వెంకట రమణాచార్యులు (58) బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయనకు ఈ నెల 19న గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో మరణించారు. రమణాచార్యులు 1992లో అధ్యాపకుడిగా సింహాచలం దేవస్థానంలో ఉద్యోగంలో చేరారు. 1994లో అర్చకుడిగా, 2020లో ప్రధానార్చకుడిగా పదోన్నతి పొందారు. శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి జరిగే వార్షిక ఉత్సవాలు, నిత్య పూజల నిర్వహణలో రమణాచార్యులు తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. ముఖ్యంగా స్వామివారి వార్షిక కల్యాణోత్సవం రోజుల్లో జరిగే ఎదురు సన్నాహోత్సవ ఘట్టంలో పూలదండలతో ఆయన చేసే నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది. రమణాచార్యులకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కూటమిలో కుమ్ములాట

- టీడీపీ, జనసేనల మధ్య భగ్గుమన్న విభేదాలు
- పెందుర్తిలో పంచకర్ల, గండిల మధ్య అగాథం
- యలమంచిలిలో సుందరపు, ప్రగడల మధ్య విరోధం
- వీఎంఆర్డీఏ సమీక్షకు సమన్వయకర్తలు రావడంపై ఎమ్మెల్యేల ఆగ్రహం
- తమకు విలువ ఇవ్వడం లేదని జనసేన ఎమ్మెల్యేల మండిపాటు
- ఒకరిపై ఒకరు కేకలు వేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి



విశాఖ సిటీ: కూటమి కోటలు బీటలు వారుతున్నాయి. టీడీపీ, జనసేన నాయకుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుతున్నాయి. ప్రధానంగా జనసేన ఎమ్మెల్యేలు, టీడీపీ సమన్వయకర్తల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జనసేన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో టీడీపీ సమన్వయకర్తల పెత్తనాన్ని జనసైనికులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇన్నాళ్లు కక్కలేక.. మింగలేక ఉన్న జనసేన ఎమ్మెల్యేలు ఉత్తరాంధ్ర అభివృద్ధి సమీక్షకు వచ్చిన మంత్రుల ముందు తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. వీఎంఆర్డీఏ చైర్మన్ చాంబర్‌లో ఒకరిపై ఒకరు అరుచుకుంటూ బాహాబాహీకి దిగారు. దీంతో వారికి సర్ది చెప్పలేక మంత్రి, స్పీకర్ తలలు పట్టుకున్నారు.

పెద్ద పెద్ద అరుపులు.. కేకలు

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో వీఎంఆర్డీఏలో ఉదయం 10 గంటలకు సమీక్ష సమావేశం ప్రారంభం కావాల్సి ఉంది. అయితే విజయనగరం, అనకాపల్లి జిల్లాల నుంచి కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆలస్యంగా వచ్చారు. ఈ సమయంలో మంత్రి నారాయణ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ చాంబర్‌లో కూర్చున్నారు. కొంతసేపటికి లోపల నుంచి పెద్ద పెద్ద అరుపులు, కేకలు బయటకు వినిపించడంతో అక్కడున్న వారందరూ విస్తుపోయారు. చాంబర్‌లో ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కాలేదు. అక్కడున్న పోలీసులు సైతం అప్రమత్తమయ్యారు.

సమీక్షకు సమన్వయకర్తలు రావడంపై ఆగ్రహం

ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి సమీక్ష సమావేశంలో పార్టీ సమన్వయకర్తలు హాజరుకావడంపై జనసేన ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారిక సమావేశానికి పార్టీ నేతలను ఎలా ఆహ్వానిస్తారని ఆగ్రహం వెలిబుచ్చారు. ముందుగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఈ విషయాన్ని లేవనెత్తినట్లు సమాచారం. నియోజకవర్గంలో సమన్వయంతో పనిచేయాలని అధినేత ఆదేశించడంతో సర్దుకుపోతూ పనిచేస్తుంటే.. టీడీపీ ఇన్‌చార్జి మాత్రం తమకు విలువ ఇవ్వకుండా నియోజకవర్గంలో పెత్తనం చెలాయిస్తున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడి ముందు తన గోడును వెళ్లగక్కినట్లు తెలిసింది. పక్కనే ఉన్న యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కూడా జత కలిశారు. అధికారిక కార్యక్రమానికి కూడా పార్టీ సమన్వయకర్తలను పిలిస్తే తమకు ఇక విలువ ఏముంటుందని మండిపడ్డారు. నియోజకవర్గంలో సగం ఎమ్మెల్యేలుగా భావిస్తున్నారా? ఇతర జిల్లాల్లో అధికారిక కార్యక్రమాలకు జనసేన ఇన్‌చార్జి, సమన్వయకర్తలను ఆహ్వానిస్తున్నారా? మమ్మల్ని సగం ఎమ్మెల్యేలుగా అనుకుంటున్నారా? అని ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై అక్కడే ఉన్న గండి బాబ్జీ, ప్రగడ నాగేశ్వరరావులు కూడా సమాధానం చెప్పడంతో వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు పెద్దగా అరుచుకుంటూ బాహాబాహీకి దిగినంత పనిచేశారు. దీంతో చాంబర్‌లో ఉన్న ఇతర ప్రజాప్రతినిధులు వారికి సర్దిచెప్పడానికి నానా పాట్లు పడ్డారు.

ఎమ్మెల్యేలు వర్సెస్ సమన్వయకర్తలు

2024 ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ నుంచి నాలుగు స్థానాల్లో జనసేన విజయం సాధించింది. ఇక్కడ అనకాపల్లి మినహా విశాఖ దక్షిణం, పెందుర్తి, యలమంచిలి నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేనల మధ్య మొదటి నుంచి విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. బదిలీల నుంచి పోస్టింగ్‌ల వరకు, భూ వ్యవహారాల నుంచి మైనింగ్‌ల వరకు అన్నింట్లోనూ టీడీపీ ఇన్‌చార్జిల ఆధిపత్యం కొనసాగుతోందని జనసేన ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇదే విషయంపై గతంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తన గన్‌మెన్‌ను సైతం పంపించేశారు. అయితే ఇరు పార్టీల అధినాయకులు.. సమన్వయంతో కలిసి పనిచేయాలని వారిని ఆదేశించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఆ నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త గండి బాబ్జీ, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఆ నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త ప్రగడ నాగేశ్వరరావుల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ.. బయటపడకుండా ఇప్పటివరకు ఉప్పు, నిప్పులా మెలుగుతూ ఉన్నారు. తాజాగా ఉత్తరాంధ్ర అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఈ సమన్వయకర్తలు హాజరుకావడం జనసేన ఎమ్మెల్యేలకు ఆగ్రహం తెప్పించింది.



కొండకర్ల జంక్షన్ నుంచి చోడపల్లి మధ్యలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న దృశ్యం

కూటమి సర్కారు కుటిల యత్నం

- పరిహారంపై తేల్చకుండానే అచ్యుతాపురం - అనకాపల్లి రహదారి పనులు ప్రారంభం
- టీడీఆర్ బాండ్లు వద్దంటున్నా నిర్వాసితుల గోడు పట్టించుకోని వైనం
- ఆర్ అండ్ బీ పరిధిలో చురుగ్గా పనులు
- నిర్వాసితులను ఆత్మరక్షణలో పడేసే పన్నాగం

పరిహారం పరిహాసమైంది.. ప్రజాభిప్రాయానికి విలువే లేదు.. టీడీఆర్ బాండ్లు వద్దంటున్న నిర్వాసితుల గోడు ఎవరికీ పట్టడం లేదు.. అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి విస్తరణ పనులను ప్రారంభించేశారు..

అచ్యుతాపురం: అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి నిర్వాసితుల విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య, నియంతృత్వ ధోరణి ప్రదర్శిస్తోంది. ఏ ఒక్కరికీ అంగీకారం లేని టీడీఆర్‌ను తెరపైకి తీసుకొచ్చి బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తుంది. రెండు దశాబ్దాల నుంచి నలుగుతున్న భూసేకరణకు ఎటువంటి తక్షణ పరిహారం ఇవ్వకుండా కేవలం కాగితాలు ఇచ్చి పని కానిచ్చేయాలన్న ప్రభుత్వ తీరు ఈ ప్రాంతంలోని రైతులు, నిర్వాసితుల హృదయాలను కలిచివేస్తోంది. టీడీఆర్ విషయం తేల్చకుండానే రెండు బ్రిడ్జిలు, ఫ్లైఓవర్ పనులను ప్రారంభించి, ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తోంది.

తొందరపాటెందుకు..?

అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి విస్తరణ అంశం ఎప్పటి నుంచో నలుగుతోంది. రెండు దశాబ్దాల కాలంలో మూడు ప్రభుత్వాలు మారాయి. 9 రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న ఈ అంశంలో పరిహారం అందించిన తర్వాతే రోడ్డు వేయాలని ఇప్పటి వరకూ పాలకులు భావించగా.. నేటి కూటమి ప్రభుత్వం టీడీఆర్ తీసుకునే విధంగా ఎన్‌వోసీపై సంతకాలు చేసేందుకు సామ, దాన, భేద దండోపాయాలను ప్రయోగిస్తోంది. తాజాగా మరో అడుగు ముందుకేసిన పరిహారం అంశం తేల్చకుండానే పనులు ప్రారంభించేసింది. తద్వారా బలవంతంగానైనా టీడీఆర్‌లను రైతులపై రుద్దే



బ్రిడ్జి పనులు ప్రారంభించిన చోట హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

భూములను లాక్కోవాలన్న ఎత్తుగడ ఆందోళన రేకెత్తిస్తోంది. కాంట్రాక్టర్ అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ పనులు, హరిపాలెం, మునగపాక వద్ద బ్రిడ్జి పనులకు ఉపక్రమించారు. ఆర్‌అండ్‌బీ పరిధిలో ఎటువంటి పరిహారం ఇవ్వాల్సిన అవసరం లేని చోట రోడ్డు విస్తరణ, పక్కన డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. తద్వారా భూములివ్వని వారిని ఆత్మ రక్షణలో పడేసేలా కాంట్రాక్టర్, ప్రభుత్వం ఉన్నట్లుగా అర్థం అవుతోంది.

అధికారులపైనా ఒత్తిడి..!

ఈ ప్రాంతంలోని రెవెన్యూ అధికారులపై ఒక కూటమి నేత తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తుంది. గ్రామ సభల్లో టీడీఆర్‌ల అంశంపై తీవ్ర వ్యతిరేకత రాగా.. వారిని ఒప్పించలేకపోయారంటూ రెవెన్యూ యంత్రాంగంపై ఆ నేత చిందులు తొక్కినట్టు తెలుస్తోంది. ఒక తహసీల్దార్ సెలవుపై వెళ్లడానికి కారణం ఇదేనా.. అన్న చర్చ సాగుతోంది. టీడీఆర్‌లపై ఇంకా స్పష్టత లేదని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలోని సిబ్బంది ఒకపక్క చెబుతుండగా.. మరోపక్క పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డుకు ఆనుకొని ఉన్న భూముల్ని కోల్పోవడం వల్ల వచ్చిన పరిహారంతో వేరొక చోట ఇల్లు కట్టుకొని స్థిరపడవచ్చన్న ఆశతో ఉన్న రైతులకు టీడీఆర్ ప్రతిపాదన అశనిపాతంగా మారింది.

టీడీఆర్‌లపై ఒత్తిడి తేవడం సరికాదు



అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి విస్తరణకు సంబంధించి నిర్వాసితులపై ఒత్తిడి తేవడం సరికాదు. ఇప్పటికే మూడు విడతలుగా గ్రామాల్లో సభలు నిర్వహించి పరిహారం ఇస్తామని చెప్పి ఇప్పుడు టీడీఆర్‌లు ఇస్తామని చెప్పడం అన్యాయం. ఇది 1200–1550 మంది రైతులు, ప్రజల సమస్య. పరిహారం ఇచ్చాకే పనులు ప్రారంభించాలి.

– రొంగలి రాము, సీపీఎం మండల కన్వీనర్, అచ్యుతాపురం

ఆత్మరక్షణలో రైతులు



అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి విస్తరణ పనులు ప్రారంభించి నిర్వాసితులపై ఒత్తిడి తేవడం దారుణం. టీడీఆర్‌లకు ఒప్పుకోబోమని ఇప్పటికే రైతులు చెప్పారు. పరిహారం ఇవ్వకుండా, స్పష్టత ఇవ్వకుండా పనులు మొదలు పెట్టడం ద్వారా రైతుల్ని ఆత్మ రక్షణలో పడేస్తున్నారు. చరిత్రలో ప్రజా కంటకులుగా నిలిచిపోతారు.

– బి.జగన్, ఉప సర్పంచ్, తిమ్మరాజుపేట

రేషన్ బండిపై రాజకీయ కక్ష

- విప్లవాత్మక డోర్ డెలివరీ వ్యవస్థ నిలిపివేత దారుణం
- కూటమి ప్రభుత్వం నిర్ణయంతో ప్రజలకు మళ్లీ పాట్లు
- మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ధ్వజం



దేవరాపల్లి: పేద ప్రజల అవస్థలను తొలగిస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటి వద్దకే రేషన్ వ్యవస్థను ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా రద్దు చేయడం అత్యంత దారుణమని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. ఈ మేరకు దేవరాపల్లి మండలం తారువలో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టారనే రాజకీయ దురుద్దేశంతో పేదల ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేస్తున్న ఎండీయూల వ్యవస్థను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. పేద ప్రజలు పనులు మానుకొని రోజంతా రేషన్ డిపోల దగ్గర క్యూలో పడిగాపులు కాస్తూ అవస్థలు పడకూడదన్న ఉద్దేశంతో తీసుకొచ్చిన ఎండీయూ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. రేషన్ డిపోల ద్వారా పాత

పాత పద్ధతిలోనే రేషన్ పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రజలకు మళ్లీ కష్టాలు తప్పవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కోసం కూలి పనులు మానుకోవాల్సిన దుస్థితి దాపరిస్తుందన్నారు. రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా పేదలకు నిత్యావసర సరకులు అందిస్తున్న ఎండీయూ వ్యవస్థపై కూటమి ప్రభుత్వం ఎందుకు అంత కర్కశంగా వ్యవహరిస్తుందో అర్థం కావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయలేదు సరికదా.. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో పాటు పలు సేవలను రద్దు చేస్తూ నిర్ణయాలు తీసుకోవడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో వేలాది మంది ఎండీయూ ఆపరేటర్లు, సహాయకుల కుటుంబాలు రోడ్డు పడతాయని బూడి ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ప్రజలను ఇబ్బందులకు గురి చేసే ఇలాంటి నిర్ణయాలను మానుకోవాలని హితవు పలికారు.

'పేట'లో పోటాపోటీ 8లో
మెయిన్‌రోడ్డులో యథేచ్ఛగా ఆక్రమణలు

పేటలో పోటాపోటీ

మెయిన్‌రోడ్డులో యథేచ్ఛగా ఆక్రమణలు

పాయకరావుపేట మెయిన్‌రోడ్డులో ఆక్రమణలు నానాటికీ పెరిగిపోతున్నాయి. నాయకుల అండతో ఒకరిని చూసి మరొకరు, పోటాపోటీగా ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి బడ్డీలను ఏర్పాటుచేస్తున్నారు. ఆక్రమణల కారణంగా రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.



పాయకరావుపేట మెయిన్‌రోడ్డులో పీహెచ్‌సీ సమీపంలో ఆక్రమణకు గురైన రోడ్డు మార్జిన్



మార్జిన్‌ను ఆనుకుని వేసిన షెడ్లు



పాయకరావుపేట: నియోజకవర్గ కేంద్రమైన పాయకరావుపేటలో మెయిన్‌రోడ్డు ఆక్రమణదారుల చెరలో చిక్కుకుంది. పట్టణంలో తాండవ వంతెన నుంచి వై.జంక్షన్ వరకు రెండు కిలోమీటర్లు మెయిన్ రోడ్డు ఉంది. రోడ్డుకు ఇరు పక్కల స్థలాన్ని ఆక్రమించి పెద్ద ఎత్తునషెడ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టారు. ప్రతి రోజూ ఎక్కడోచోట ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో 100 అడుగులు ఉండాల్సిన రోడ్డు ఇరుకుగా మారి, నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ రోడ్డులో రెండువైపులా స్థలాలను ఆక్రమించి ఇప్పటికి సుమారు 120 బడ్డీలు, పాకలను ఏర్పాటు చేశారు.

శరవేగంగా అభివృద్ధి

పాయకరావుపేట పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. స్థానికులతోపాటు, పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో ఉన్న రసాయన పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులంతా పాయకరావుపేటలో నివాసం ఉంటూ రాకపోకలు సాగిస్తున్నారు.



రోడ్డు స్థలం ఆక్రమణకు గురవడంతో రహదారిపైనే పార్కింగ్ చేసిన వాహనాలు

పిల్లల చదువులు, ఉపాధి కోసం గ్రామీణ ప్రాంతాలనుంచి పలువురు వచ్చి పట్టణంలోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. చుట్టు పక్కల 40 గ్రామాల ప్రజలు వాణిజ్య అవసరాల కోసం నిత్యం ఇక్కడి వస్తుంటారు. దీంతో పట్టణం నిత్యం రద్దీగా ఉంటోంది. ముఖ్యంగా మెయిన్ రోడ్డుపై నిత్యం జనసంచారం ఉంటోంది. రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది.

పంచాయతీ స్థలాల్లోనూ పాగ

ముందు నాయకుల అండతో చిన్న స్థలాన్ని ఆక్రమించి బడ్డీ ఏర్పాటు చేసి, కొద్దిరోజుల తరువాత పర్మినెంట్‌గా షెడ్లు వేసేస్తున్నారు. మెయిన్‌రోడ్డుపై రాకపోకలు సాగించేవారు రోడ్డు దిగేందుకు అడుగు జాగా కూడా ఉండడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోర్టు వివాదం కారణంగా మెయిన్ రోడ్డును విస్తరించకుండా డబుల్‌లైన్ రహదారిగా అభివృద్ధి చేశారు. అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత రాజ్య సభ సభ్యుడు గొల్ల బాబూరావు డబుల్ రోడ్డు నిర్మించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నిధులు విడుదల చేయించినప్పటికీ కోర్టు వివాదం కారణంగా రూ.రెండు కోట్లతో పాతరోడ్డును అభివృద్ధి చేసే పరిస్థితి ఏర్పడింది. మెయిన్‌రోడ్డుతో పాటు పట్టణంలో పలు ప్రాంతాల్లో వేసిన లేఅవుట్లలో కమ్యూనిటీ అవసరాల కోసం పంచాయతీకి కేటాయించిన స్థలాలు సైతం కబ్జాకు గురయ్యాయి. వీటి గురించి పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు.

తరలివస్తున్న మాల్స్

పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన షాపింగ్ మాల్స్ ఇప్పుడు పాయకరావుపేట పట్టణానికి పెద్ద ఎత్తున తరలివస్తున్నాయి. వస్త్ర దుకాణలను ఏర్పాటు చేస్తున్నారు. ఆధునిక హంగులతోకూడిన మూడు సినిమా థియేటర్లు ఉన్నాయి. మూడు జూనియర్ కళాశాలలు, రైసు మిల్లులు, మోటారు సైకిళ్లషోరూములతో పట్టణం వాణిజ్యకేంద్రంగా మారింది. అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండడంతో పాయకరావుపేటలో నివాసం ఏర్పర్చుకునే వారి సంఖ్య పెరుగుతోంది. దీంతో పాటు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. మెయిన్ రోడ్డును విస్తరిస్తేనే ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు తెలిపారు.

ఆక్రమణలు పెరిగిపోతున్నాయి



మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా రోజు రోజుకు ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సాయంత్రం అయితే తీవ్రమైన ట్రాఫిక్‌సమస్యలు ఎదుర్కొంటున్నాం. పాయకరావుపేటనుంచి తుని వెళ్లాలంటే చాలా సమయం పడుతోంది. బడ్డీలు ఏర్పాటు చేసి ఆ తరువాత పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. డబుల్‌లైన్‌గా విస్తరిస్తే తప్ప రాకపోకలు సాగించడం కష్టం. చిరువ్యాపారుల సమస్యలు పరిష్కరించి రోడ్డు విస్తరణ చేపట్టాలి.

– జి.రాజశేఖర్‌రెడ్డి, పాయకరావుపేట

చిన్నారి కిడ్నాప్ కేసులో మరో ముగ్గురు అరెస్ట్

అనకాపల్లి టౌన్: అనకాపల్లిలో సంచలనం సృష్టించిన బాలిక రోహిత కిడ్నాప్ కేసులో మరో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి డీఎస్పీ బి.మోహన్‌రావు తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15న రోహిత తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, బాలిక ఆచూకీ కనుగొని, కిడ్నాప్ చేసిన గాజువాకకు చెందిన లక్ష్మి, ఆమె భర్త అప్పలస్వామినాయుడులను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా కేసు దర్యాప్తులో భాగంగా లక్ష్మి ఇచ్చిన సమాచారం మేరకు లోతుగా విచారణ చేపట్టగా.. ఈ కిడ్నాప్‌లో మరో ముగ్గురికి సంబంధం ఉందని నిర్ధారించారు. కశింకోట మండలం ఏఎస్ పేట గ్రామానికి చెందిన గొర్లి శ్రీనివాసరావుకు పిల్లలు లేకపోవడంతో దత్తత తీసుకోవాలని ప్రయత్నించారు. అయితే న్యాయపరంగా అడ్డురావడంతో అక్రమంగా ఎవరినైనా దత్తత తీసుకోవాలనే ఉద్దేశంతో తనకున్న పరిచయాలతో అనకాపల్లి గాంధీనగర్‌కు చెందిన తగరంపూడి షణ్ముఖను శ్రీనివాసరావు సంప్రదించారు. ఇద్దరూ కలిసి అనకాపల్లి లోకావారి వీధికి చెందిన బోనాల దేవిని సంప్రదించగా.. పాప లేదా బాబు గానీ అప్పజెప్పుతానని, అందుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ మోహన్‌రావు

అవుతుందని ఆమె చెప్పింది. అందుకు ఒప్పుకున్న శ్రీను తన బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి అడ్వాన్స్‌గా షణ్ముఖకు రూ.లక్ష అందజేశాడు. అనంతరం షణ్ముఖ వెళ్లి దేవికి రూ.30వేలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. ఆ తరువాత దేవితో ఒప్పందం కుదుర్చుకున్న గాజువాకకు చెందిన లక్ష్మి, అప్పలస్వామినాయుడు.. బాలికను కిడ్నాప్ చేసి, విక్రయించే ప్రయత్నంలో భార్యాభర్తలు పోలీసులకు దొరికిపోయారు. వీరిని ఈ నెల 17న అరెస్ట్ చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మిగతా ముగ్గురిని అరెస్ట్ చేసి, షణ్ముఖ నుంచి రూ.70వేలు, శ్రీను నుంచి రూ.750 స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఎస్‌ఐలు వెంకటేశ్వరావు, ఈశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ క్వారీలకు అండగా నాయకులు, అధికారులు

- వారి గుట్టు వివరాలతో బయటపెడతా..
- చోడవరం జనసేన ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్.రాజు

రోలుగుంట : మండలంలో అనుమతులు లేకుండా నడుస్తున్న క్వారీలపై అధికారుల జాప్యం వీడాలని చోడవరం జనసేన ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్.రాజు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎటువంటి అధికారిక అనుమతులు లేని క్వారీల నుంచి నిత్యం వందలాది లారీలతో బహిరంగంగానే మెటీరియల్ తరలింపు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం బాధాకరమన్నారు. అలాగే అనుమతులున్న క్వారీలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్నారు. ఈ క్వారీ యజమానులు చేస్తున్న అక్రమాలకు అండదండగా ఉంటూ వారి నుంచి నిత్యం డబ్బులు వసూలు చేస్తున్న రాజకీయనాయకులు, అధికారులకు సంబంధించిన వివరాలను త్వరలోనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు ఆయన తెలిపారు.



రోలుగుంటలో అక్రమ క్వారీలను పరిశీలిస్తున్న జనసేన చోడవరం ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్.రాజు

సాగరతీరంలో అయోధ్య రామ మందిరం

- నేటి నుంచి సందర్శకులకు అనుమతి



ఏయూ క్యాంపస్: విశాఖ నగరవాసులకుసరికొత్త అనుభూతిని పంచేందుకు అయోధ్య రామ మందిరం నమూనా సిద్ధమయింది. బీచ్‌రోడ్డులోని పామ్‌బీచ్ హోటల్ పక్కన ఏర్పాటు చేసిన రామ మందిర నమూనాను గురువారం ఉదయం 8.48 గంటలకు పూజా కార్యక్రమాలతో ప్రారంభించనున్నారు. వేదిక వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్ మాట్లాడుతూ విశాఖ వాసులకు అయోధ్య రామ మందిరం సందర్శించిన అనుభూతిని పంచేలా 90 అడుగుల ఎత్తు, 392 స్తంభాలు, 44 ద్వారాలతో నిర్మించినట్లు పేర్కొన్నారు. రెండు నెలలపాటు ప్రజల సందర్శనకు ఇది అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాలూరి శేషమాంబ, దుర్గాప్రసాద్, బీజేపీ నాయకులు అశోక్, దిలీప్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

కె.కోటపాడు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పోతనవలస గ్రామానికి చెందిన చిరికి మనోజ్(24) బుధవారం కేజీహెచ్‌లో మృతిచెందాడు. మృతుడు తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎ.కోడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎ.కోడూరు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోతనవలస గ్రామానికి చెందిన మనోజ్ ఈ నెల 17న పోతనవలస నుంచి ఆర్.వై.అగ్రహారానికి బైక్‌పై బయలుదేరాడు. మార్గ మధ్యంలో రోడ్డుకు అడ్డంగా చెట్టుకొమ్మ పడి ఉండడాన్ని గమనించకుండా వెళ్లడంతో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. మనోజ్ రోడ్డుపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కె.కోటపాడులో ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.



చికిత్స పొందుతూ మృతి చెందిన మనోజ్

వెంకన్నకు సమర్పించిన కానుకలకు రశీదులు ఇప్పించండి

ఉపమాక దేవాలయ ఇన్‌స్పెక్టర్‌ను కోరిన భక్తులు

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వర స్వామికి తాము సమర్పించిన కానుకలకు రశీదులు ఇప్పించాలని భక్తులు కోరారు. బుధవారం ఉపమాకకు చెందిన కర్రిగురువోజీ, వమ్మవరానికి చెందిన శ్రీకాకుళపు బంగారు శెట్టిలు దేవస్థాన ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావును కలిశారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన కల్యాణోత్సవాల సందర్భంగా గురువోజీ పావుతులం బంగారు ఉంగరాన్ని, బంగారు శెట్టి తులం బంగారు శతమానాలను స్వామి వారికి కానుకలుగా అందజేశారు. వీటిని ఆలయప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులకు అందజేశామన్నారు. రశీదు ఇమ్మని కోరగా కల్యాణోత్సవాల్లో బిజీగా ఉండటం వల్ల తర్వాత రశీదు ఇస్తామని మరోసారి రావాలని చెప్పారన్నారు. ఇంతవరకు రశీదులు ఇవ్వలేదన్నారు. తాము స్వామివారికి ఇచ్చినకానుకలకు రశీదులు ఇప్పించి, ఆ వస్తువులు స్వామివారికిచెందేలా చూడాలని కోరారు.దీనిపై ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు మాట్లాడుతూ భక్తులు తెలిపిన వివరాల ప్రకారం కానుకలు తమ వద్దకు ఇంకా రాలేదన్నారు. ఆ వస్తువులు తన వద్దకు వస్తే టీటీడీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి దేవస్థానం అప్రైజర్‌తో తనిఖీలు చేసి, దాతలు పేర్కొన్న విధంగా వస్తువుల బరువు సరిచూసి రశీదు అందజేయడం జరుగుతుందన్నారు.ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన వారిలో దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు, నాయకులు కొప్పిశెట్టి జగదీశ్వరరావు, వాసు, తోలేటి శ్రీను తదితరులు ఉన్నారు.



ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న దాతలు

రోడ్లపై 'బీర్ల వరద'

- బీర్ల లోడుతో వెళ్తున్న రెండు వాహనాలకు ప్రమాదం
- తండాలదిబ్బ వద్ద ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్న బీర్ల లారీ
- పులపర్తి వద్ద మరో వ్యాన్ బోల్తా



తండాలదిబ్బ వద్ద ప్రమాదానికి గురైన బీర్ల లోడు లారీ

యలమంచిలి రూరల్: బీర్లు తరలిస్తున్న వాహనాలు మండలంలోని రెండు ప్రాంతాల్లో ప్రమాదాలకు గురవడంతో సీసాలు రోడ్లపై చెల్లాచెదురుగా పడ్డాయి. వాటిలో సగానిపైగా పగిలి.. రహదారులపై బీర్ల వరద పారింది. కింగ్ ఫిషర్ అల్ట్రా బీర్ల లోడుతో వెళ్తున్న రెండు వాహనాలు బుధవారం ప్రమాదాలకు గురయ్యాయి.ఈ రెండు ప్రమాదాలు 16వ నంబరు జాతీయ రహదారిపై యలమంచిలి మండల పరిధిలో జరిగాయి. వివరాలివి.. తండాలదిబ్బ కూడలి వద్ద జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి బీర్ల లోడుతో వెళ్తున్న లారీ ఢీకొంది.ఈ ప్రమాదంలో సుమారుగా 86 కేసుల్లో బీర్ల సీసాలు పగిలిపోయినట్టు యలమంచిలి ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.పగిలిన బీర్ల సీసాల విలువ సుమారుగా రూ.రెండు లక్షలకు పైగా ఉంటుందని అంచనా.రణస్థలం బెవరేజస్ నుంచి కడప ప్రభుత్వ డిపోకు ఈ బీర్ల లోడు లారీ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు చెబుతున్నారు.అయితే దీనిపై యలమంచిలి రూరల్ పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయకపోవడం, ప్రమాదానికి గురైన బీర్ల లారీ నుంచి బాగున్న సరుకును మరో లారీలోకి ఎక్కించేక్రమంలో ఎక్సైజ్ పోలీసులు పొంతనలేని సమాధానాలు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది.ప్రమాదానికి గురైన కంటైనర్ లారీలో మొత్తం 1,275 బీర్ల కేసులు వెళ్తుండగా 86 కేసుల్లో సీసాలు పాడైనట్టు ఒకసారి,మొత్తం 1,270 కేసులే ఉన్నాయని,వాటిలో 95 కేసుల్లో బీర్ల సీసాలు డ్యామేజ్ అయ్యాయని మరోసారి ఎక్సైజ్ పోలీసులు ఘటనాస్థలానికి కవరేజికి వెళ్లిన మీడియా ప్రతినిధులకు చెప్పడం గమనార్హం.ఇదిలా ఉండగా ప్రమాదానికి గురైన బీర్ల లారీ నుంచి సరుకును మరో లారీలోకి మార్చిన తర్వాత ఆ వాహనాన్ని మూడు కిలోమీటర్ల దూరం వెళ్లిన తర్వాత ఎర్రవరం సమీపంలో ఒక పెట్రోల్ బంక్ వద్ద గంటల సేపు నిలిపి ఉంచారు.అబ్కారీ శాఖకు చెందిన బీర్ల లోడు ప్రమాదానికి గురైనపుడు ఎంత సరుకు దెబ్బతిందో నిర్ధారించడానికి నిర్వహించాల్సిన పంచనామాలో నిబంధనలు పాటించలేదని తెలుస్తోంది.అంతేకాకుండా రణస్థలంలో బీర్ల లోడుతో బయలుదేరిన లారీ ఎప్పుడు ప్రమాదానికి గురైందో ఎవరూ కచ్చితంగా చెప్పకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో బయటపడాల్సి ఉంది.



పులపర్తి వద్ద బోల్తా పడిన వ్యాన్ నుంచి బయటకు తీసిన బీరు సీసాలు

పులపర్తి వద్ద బీర్ల వ్యాన్ బోల్తా

యలమంచిలి మండలం పులపర్తి వద్ద బీర్ల లోడుతో వెళ్తున్న వ్యాన్ బోల్తా పడింది.యలమంచిలి నుంచి తునివైపు వెళ్తుండగా జరిగిన ఈ ప్రమాదంలో భారీగా బీర్లు,ఇతర మద్యం సీసాల లోడుకు నష్టం వాటిల్లింది.డ్యామేజ్ కాకుండా మిగిలిన సరుకును అక్కడ సిబ్బంది వేరు చేశారు.ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఏం తిని బతకాలి..!



పందూరులో రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

కోటవురట్ల: పొట్టకూటి కోసం ఉపాధి పని చేస్తున్న కూలీల కడుపులు మాడ్చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. పది వారాలుగా కూలి డబ్బులు ఇవ్వకపోతే ఆ కుటుంబాలు ఎలా బతకాలంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పందూరు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు బుధవారం నిరసన తెలిపారు. పెద్ద సంఖ్యలో హాజరైన కూలీలు రోడ్డుపై బైఠాయించారు.ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ఈ పథకం నియమ నిబంధనలను మార్చడమే కాకుండా, పది వారాలుగా కూలి డబ్బులు ఇవ్వకపోతే ఏం తిని బతుకుతారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు రాష్ట్రాల చేతిలో ఉన్న పథకం అమలు, ఉపాధి పనుల కల్పన, అంచనా వ్యయం తదితర అంశాలు ఇకపై కేంద్ర ప్రభుత్వం చేతిలోకి వెళ్లనున్నట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యుక్తధార యాప్ ద్వారానే ఇకపై కూలీల వేతనాలు చెల్లించనున్నారన్నారని చెప్పారు. ఇందుకోసం ప్రస్తుతం మండలానికో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టి అమలు చేస్తున్నారన్నారు. ఈ యాప్ వినియోగం ద్వారా ఇకపై రాష్ట్రాల ప్రమేయం పూర్తిగా ఉండదని, కేంద్ర ప్రభుత్వమే అన్ని పనులు పర్యవేక్షిస్తుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయం మార్చుకుని, పాత పద్ధతిలోనే కొనసాగించాలని, వెంటనే 10 వారాల వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

విశాఖలో టూరిజం సర్క్యూట్

- ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిపై మంత్రి నారాయణ సమీక్ష
- అమరావతిపైనే కాదు.. విశాఖపై కూడా దృష్టి పెట్టాలని ఎమ్మెల్యేల విజ్ఞప్తి

విశాఖ సిటీ: విశాఖను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు టూరిజం సర్క్యూట్‌కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో బుధవారం ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను ఏకరవు పెట్టారు. జీవీఎంసీ వాటర్ పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలని, నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని, పుష్ కార్ట్‌లు లేకపోవడంతో పారిశుధ్య పనులకు ఇబ్బందులు, 2014లో పేదల ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం డీడీలు కట్టించుకున్న వారికి ఇళ్ల స్థలాల మంజూరు, సదుపాయాలు కల్పించాలని కోరారు.

ఏకపక్ష నిర్ణయాలు వద్దు : ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, ప్రాజెక్టుల విషయంలో అధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదని ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అమరావతితో పాటు విశాఖపై కూడా దృష్టి పెట్టాలని చెప్పారు. దీనిపై మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. కోస్టల్ కారిడార్ నుంచి భీమిలి వరకు బీచ్ కారిడార్ అభివృద్ధిపై కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం వీకేపీసీపీఐఆర్, మాస్టర్‌ప్లాన్-2041, ఎంఐజీ లేఅవుట్లు, ప్రతిపాదిత లేఅవుట్లు, మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణాలు, తీర ప్రాంత కొత్త ప్రాజెక్టు, కైలాసగిరి, రుషికొండ సమగ్రాభివృద్ధి, భోగాపురం నుంచి రాంబిల్లి వరకు సెమీ రింగ్ రోడ్డు, సింహాచలం స్థలాలకు సంబంధించిన సమస్యలు, అనకాపల్లి ల్యాండ్ పూలింగ్ వంటి అంశాలపై చర్చించారు. ఇకపై ప్రతి నెలా సమావేశం నిర్వహించి ఉత్తరాంధ్ర అభివృద్ధి పనులపై సమీక్షిస్తామన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ సంపత్ కుమార్, విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు హరేందిర ప్రసాద్, విజయకృష్ణన్, అంబేడ్కర్, మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

బకాయి పడ్డ బిల్లులు, జీతాలు వెంటనే విడుదల చేయాలి

- మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకుల డిమాండ్
- ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా

చోడవరం : మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు రావలసిన బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద చోడవరం మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న నిర్వాహకులంతా కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. తమకు గత డిసెంబరు నెల నుంచి నేటి వరకూ మధ్యాహ్న భోజన పథకం సంబంధించిన బిల్లులు మంజూరు కాలేదని, బకాయి పడ్డ బిల్లులు వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని వరలక్ష్మి డిమాండ్ చేశారు. బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని, అప్పులకు వడ్డీలు కట్టుకోలేక చాలా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఐదు నెలలుగా బిల్లులు రాకపోతే వచ్చే జూన్ నుంచి పాఠశాలలు తెరిస్తే విద్యార్థులకు ఎలా భోజనం పెట్టగలమని ఆమె ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా 15వ తేదీకి బిల్లులు వచ్చేవని, కూటమి ప్రభుత్వం వచ్చాక సకాలంలో బిల్లులు ఇవ్వడం లేదని ఆమె ధ్వజమెత్తారు. అదే విధంగా తమ వేతనాలు కూడా సకాలంలో ఇవ్వడం లేదని, ఇదే ఉపాధిగా నమ్ముకొని జీవిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులందరం జీతాలు రాక, బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయామని చెప్పారు. వెంటనే ప్రభుత్వం తమ జీతాలు, బిల్లులు చెల్లించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో సంఘ ప్రతినిధులు జి.లక్ష్మి, నారాయణమ్మ, ఎర్రయ్యమ్మ, బి. లక్ష్మి, దేముడమ్మ, సత్యవతి, దేవి పాల్గొన్నారు.



ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు

క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనకాపల్లి: విద్యుత్‌శాఖ డి–1 సెక్షన్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ కోసం 11 కేవీ ఉడ్‌పేట, పెరుగుబజార్ జంక్షన్ ఫీడర్ పరిధిలో ఈనెల 23వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉడ్‌పేట ఫీడర్ పరిధిలో గూడ్స్‌రోడ్డు ప్రాంతం, కొణతాలవారి వీధి, వాటర్‌ట్యాంక్, శాఖవీధి, ఆమంచివారి వీధి, వేల్పుల వీధి, పెరుగుబజార్ ఫీడర్ పరిధిలో లక్ష్మీనారాయణనగర్, గొల్లవీధి, పీలావారి వీధి, యర్రవారివీధిల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయన్నుట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు విద్యుత్‌శాఖ ఉద్యోగులకు సహకరించాలని వారు కోరారు.

రామాయణంపై అవగాహన అవసరం


తాళ్లపాలెం గ్రంథాలయంలో మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి జగన్నాథం

కశింకోట: రామాయణం మహా కావ్యమని, దీని గురించి ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పర్చుకోవాలని తాళ్లపాలెం గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం రామాయణం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరికీ రాముని మార్గం అనుసరణీయమన్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ


శారదానగర్ 6వ వీధిలో రహదారిపై ప్రవహిస్తున్న వర్షం నీరు

అనకాపల్లి: మండలంలో కొత్తూరు పంచాయతీ శారదానగర్ 6వ వీధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని స్థానికులు సూరిబాబు, అప్పారావు, సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ వీధిలో సుమారు 30 కుటుంబాలు నివాసముంటున్నాయని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో రహదారులపై మురుగునీరు ప్రవహిస్తోందని వారు తెలిపారు. వర్షాలుపడే సమయంలో దుర్వాసన వెలువడుతోందని, తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

సకాలంలో సాగునీరు అందించాలి

అనకాపల్లి టౌన్: రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఇరిగేషన్ అధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగునీటి సంఘాలకు కేటాయించిన నిధులను సద్వినియోగం చేయాలని తెలిపారు. సాగునీటి కాలువలు ఆక్రమణలకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ డీఈ స్వామినాయుడు, ఎన్ఆర్‌జీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 453 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,570	4,850
రెండో రకం	3,810	4,300
మూడోరకం	3,350	3,600

అనకాపల్లి సినిమాలు

లెవన్ :రాజా
శుభం :సత్యనారాయణస్క్రీన్-1
లవ్‌లీ : సత్యనారాయణ స్క్రీన్-2 (1, 2 షోలు)
సత్యనారాయణ స్క్రీన్-2 :శుభం, (ఉదయం, మధ్యాహ్నం)
హిట్-3 :పర్తిసాయి
సింగల్ :షిర్డీసాయి
మన కుటుంబం :వెంకటేశ్వర
అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి :శ్రీసత్య
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్ :రామచంద్ర

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 385 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 339 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924–223595 నంబర్‌లో సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్ 13 యూనిట్లు, బి పాజిటివ్ 6 యూనిట్లు, ఒ పాజిటివ్ 11 యూనిట్లు, ఏబీ పాజిటివ్ 3 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ య.లోకేష్(ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం


కన్నూరుపాలెం వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం–తోటకూరపాలెం మధ్య పంచాయతీ రాజ్ శాఖకు చెందిన రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం పడిందంటే నరకయాతనే. గోతుల్లో నీరు చేరడంతో సరిగా కనిపించక వాహనాలు వాటిలో పడి ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతుండగా, వాహనాలు దెబ్బతింటున్నాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు, వాహన చోదకులు వాపోతున్నారు. కన్నూరుపాలెం నుంచి తోట కూరపాలెం(రావికమతం మండలం) వరకు సుమారు 5.3 కిలో మీటర్ల దూరం ఉంటుంది. కన్నూరుపాలెం నుంచి సుమారు 20 కిలో మీటర్ల దూరం ఉన్న రావికమతం మండలంలోని గ్రామాలకు రాకపోకలు సాగించడానికి ఇది దగ్గర మార్గం. దీంతో పాటు బంధుత్వాలు ఉండటం, తమ గ్రామాలకు చేరుకోవడానికి కశింకోట,మాకవరపాలెం మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు, వాహన చోదకులు నిత్యం ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. తీడ, శివారు కచ్చర్లపాలెం, చెరకాం, రెడ్డివానిపాలెం, తోటకూరపాలెం తదితర గ్రామాల ప్రజలకు ఈ మార్గం సౌకర్యంగా ఉంటుంది. ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు కన్నూరుపాలెం హైస్కూలుకు ఈ రోడ్డుపై నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈరోడ్డులో తీడ దాటిన తర్వాత పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అసలే చిన్న రోడ్డు ఆపై గోతులతో నిండి ఉండడంతో రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏ క్షణంలో ఎటువంటి ప్రమాదానికి గురికావలసి వస్తుందోనని భయపడుతున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తోంది. ఎన్నికల ముందు హామీ ఇచ్చినా ఇంకా రోడ్డు మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహన చోదకులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు పునర్నిర్మాణానికి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


గోతులతో నిండిన రోడ్డు

రోడ్డుకు మరమ్మతులు చేయాలి



కన్నూరుపాలెం నుంచి తోట కూరపాలెం వరకు రోడ్డు గోతులతో నిండి అధ్వానంగా ఉంది. ఎక్కువగా కన్నూరుపాలెం నుంచి తీడ గ్రామం వరకు ఆటోలో ప్రయాణికులను చేరవేస్తూ ఉంటాను. రోడ్డుపై గోతులు ఉండడం వల్ల భయం భయంగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఆటో గోతుల్లో పడి మరమ్మతులకు గురవుతోంది. వర్షం వస్తే మరింత ఇబ్బంది పడుతున్నాం. సత్వరమే రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

– మేడిశెట్టి సూరిబాబు, ఆటో డ్రైవర్, తీడ, కశింకోట మండలం.

త్వరలో నిర్మాణానికి చర్యలు చేపడతాం

కన్నూరుపాలెం–తీడ–తోటకూరపాలెం మధ్య సుమారు 5.3 కిలో మీటర్ల రోడ్డు పునర్నిర్మాణానికి ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో ప్రతిపాదించాం. ఈ మేరకు రూ.43 లక్షలు మంజూరైంది. టెండర్లు పిలిచి పునర్నిర్మాణానికి చర్యలు చేపడతాం.

– శక్తి కుమారి, డీఈఈ, పంచాయతీరాజ్ ప్రాజెక్టు విభాగం, అనకాపల్లి

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డులో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరుగుతుందని ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్టీ పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి, మాజీ ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, పార్టీ రాష్ట్రకార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ హాజరుకానున్నట్టు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు చింతామణి గణపతి దత్తక్షేత్రంలో హనుమాన్ జయంతి

అనకాపల్లి: జీవీఎంసీ విలీనగ్రామమైన చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఈనెల 22న హనుమాన్ జయంతి నిర్వహించనున్నట్టు చింతామణి గణపతి దత్తక్షేత్రం నిర్వాహకులు ఆంజనేయరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెల్లవారు జాము నుంచి స్వామివారి మూల విరాట్‌కు క్షీరాభిషేకం, తమలపాకులు, నిమ్మకాయలు, సింధూరం, అరటి పళ్లు, మామిడిపళ్లతో సహస్రనామార్చన, సిందూరార్చన, పూర్ణఫల దీక్షలు, హోమం నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు సమన్వయకర్త భరత్ పరామర్శ


తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న భరత్‌కుమార్


బవులవాడ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమ్మిన శ్రీను కుటుంబాన్ని పరామర్శిస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: మండలంలో తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావు కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడడంతో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ బుధవారం పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బవులవాడలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమ్మిన శ్రీను తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. శ్రీను కుటుంబ సభ్యులను మలసాల భరత్‌కుమార్ పరామర్శించి, ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్ ఎంపీపీ అయితా రాము, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొన్నబత్తుల వెంకటరమణ, వెంకుపాలెం గ్రామ సర్పంచ్ నాగేశ్వరరావు, ఎంపీటీసీ వెంకటేష్, బవులవాడ గ్రామసర్పంచ్ వెంకట అప్పారావు, పార్టీ నాయకుడు దాడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే ఇళ్లు నిర్మించుకోవాలి


వెదురుపర్తిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట: లబ్ధిదారులు తమకు మంజూరైన గృహాలను సత్వరమే నిర్మించుకోవాలని ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. మండలంలోని వెదురుపర్తి గ్రామంలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ గృహ నిర్మాణ కాలనీని మండల హౌసింగ్ ఏఈ వి. శ్రీనివాసరావుతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. అసంపూర్తి గృహాలను సకాలంలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకుంటే బిల్లులు సత్వరమే చెల్లించనున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళి

కశింకోట: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రధాన రహదారిలో గల రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అనకాపల్లి అసెంబ్లీ కో–ఆర్డినేటర్ మలపురెడ్డి కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాళ్ల వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు తుట్టా రమణ, కార్యదర్శి కత్తెర శ్రీధర్, అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బోయిన భానుమూర్తి, యువజన విభాగం ఉపాధ్యక్షుడు బి.బాలమురళి, సత్యనారాయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సేనాపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ఏర్పాటు


ఉత్సవ కమిటీని అభినందిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ అప్పలరాజు

మాడుగుల : మాడుగుల మోదకొండమ్మ పండగ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో బుధవారం ఉత్సవ కమిటీని డ్రా పద్ధతిలో ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పల రాజు మాట్లాడారు. డ్రా పద్ధతిలో ఎన్నుకున్న ఉత్సవ కమిటీ రెండేళ్లపాటు కొనసాగుతుందన్నారు. మాడుగుల పట్టణంలో 16 వార్డుల నుంచి వార్డుకు ఒక్కరు చొప్పున 16 మంది సభ్యులను ఎన్నుకున్నట్టు చెప్పారు. నూతనంగా ఎన్నికైన ఉత్సవ కమిటీని ఆలయ కమిటీ చైర్మన్ అప్పలరాజుతో పాటు ఇతర కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సంపద తయారీ కేంద్రాలతో అదనపు ఆదాయం


మునగపాక సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

మునగపాక: సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని డీపీవో శిరీషారాణి అన్నారు. మండలంలోని మునగపాక, తిమ్మరాజుపేట గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాలను ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి, పొడి చెత్త సేకరణపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సంపద తయారీ కేంద్రాల ద్వారా తయారయ్యే కంపోస్టు అమ్మకాలపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు కృషి చేయాలని చెప్పారు. ఇంత వరకు ఎంతమేర ఆదాయం సమకూరిందన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈవోఆర్డీ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు నాగేశ్వరరావు, వెంకటేష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హనుమజ్జయంతికి ఆలయాలు సిద్ధం


రంగులతో తీర్చిదిద్దిన కశింకోటలో అభయాంజనేయస్వామి విగ్రహం


కశింకోట గవరపేటలో ఆంజనేయస్వామి విగ్రహం


చాలీసా అభయాంజనేయ స్వామి

కశింకోట: మండల కేంద్రం కశింకోటలో గురువారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. స్థానిక జాతీయ రహదారి కూడలి వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతి ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నారు. స్వామి వారి విగ్రహాన్ని రంగులతో తీర్చిదిద్దారు. గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గల హనుమంతుని విగ్రహానికి తమలపాకులతో అర్చన, ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ భీశెట్టి దుర్గానాగేశ్వర రావు తెలిపారు. అశోక ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ విగ్రహాన్ని,ఆలయాన్ని ముస్తాబు చేశారు. పూసర్లవీధి, సలాది వీధి, కుమ్మర వీధి, వడ్డి వీధి, కనకమహాలక్ష్మివీధి తదితర ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అనకాపల్లి టౌన్: స్థానిక చాలీసా అభయాంజనేయస్వామి ఆలయంలో పాటు పట్టణం, మండలంలోని పలు ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. శారదానది ఒడ్డున ఉన్న చాలీసా అభయాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేయనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు కస్పేపల్లి సూర్యప్రకాశరావు తెలిపారు.

నేటి నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

కశింకోట: స్థానిక గవరపేటలో శారదానది తీరాన గల వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలకు వేదిక కానుంది. గురువారం నుంచి నాలుగు రోజులపాటు ఈ పోటీలు జరగనున్నాయి. స్థానిక అశోక ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ ఆధ్వర్యంలో పది నాటికలను ఎంపిక చేసి, ప్రదర్శనకు సన్నాహాలు చేశారు. ప్రతి రోజూ రాత్రి 8.30 గంటల నుంచి పోటీలు జరగనున్నాయి. మొదటి రోజు యువ భేరి థియేటర్ ఆర్గనైజేషన్ (హైదరాబాద్) వారి 'నా శత్రువు' నాటిక, బీవీకే క్రియేషన్స్ (కాకినాడ) వారి 'తితిక్ష' నాటికలను ప్రదర్శించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి దేవినాయుడు తెలిపారు. తమ పరిషత్ ఏర్పాటు అయిన తర్వాత ఐదో విడతగా నిర్వహిస్తున్న పోటీలను ఎప్పటిలాగే విజయవంతం చేసి, ప్రోత్సాహం అందించాలని కోరారు.

ఆశాజకనంగా నువ్వు పంట


పూత పంట దశలో నువ్వు చేను

నాతవరం : మండలంలో ఈఏడాది నువ్వు పంట ఆశాజకంగా ఉంది. గత ఏడాదితో పోల్చుకుంటే నువ్వు పంట సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంది. మండల వ్యాప్తంగా 922 ఎకరాల్లో నువ్వులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం నువ్వు చేను పూత దశలో ఉండగా కొన్ని చోట్ల పంట దశలోకి చేరువలో ఉంది. నువ్వుల ధర కూడా మార్కెట్లో 100 కేజీల బస్తా రూ.10వేలకు పైగా పలుకుతుంది. నెల రోజుల వ్యవధిలో నువ్వు పంట చేతికందే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. నువ్వు పంట దిగుబడి బాగుంటే మంచి ఆదాయంతో ఖరీఫ్ సాగు పెట్టుబడి కోసం ఉపయోగపడుతుందని రైతులు ఆశిస్తున్నారు.

ముంచెత్తిన వాన

లోతట్టు ప్రాంతాలు జలమయం


కశింకోటలో మేదరవీధి రోడ్డుపై నిలిచిన వర్షం నీరు


తాళ్లపాలెంలో జాతీయ రహదారి పక్కన నిలిచిపోయిన నీరు


తాళ్లపాలెంలో పిడుగుపాటుకు దెబ్బతిన్న ఇంటి గోడ


తాళ్లపాలెం సంతలో రోడ్డుపై నిలిచిన నీరు

కశింకోట/అనకాపల్లి టౌన్: నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. కశింకోట, అనకాపల్లి మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కశింకోటలోని ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డు, గవరపేట మేదర వీధి రోడ్డు, మధ్య వీధి రోడ్డు, స్టేట్ బ్యాంకు రోడ్డు, పూసర్లవీధి రోడ్లపై నీరు నిలిచిపోయింది. ఆర్టీసీ బస్ స్టేషన్ రోడ్డు బురదమయంగా మారి ప్రయాణికులు ఇబ్బందులకు గురవయ్యారు. తాళ్లపాలెంలోని హైస్కూలుకు వెళ్లే మార్గంలో జాతీయ రహదారి వద్ద నీరు నిలిచిపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు. తాళ్లపాలెం సంత ప్రాంతం, జి. భీమవరం, సుందరయ్యపేట ప్రాంతాల్లో రోడ్లపై గోతులు ఉండడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. అనకాపల్లి పట్టణంలో సుమారు గంట సేపు వర్షం పడింది. ఈ వర్షం దుక్కులకు ఉపయోగపడగలదని రైతులు తెలిపారు.

పిడుగు పాటుకు దెబ్బతిన్న ఇంటి గోడ

తాళ్లపాలెం రామాలయం వద్ద ఉన్న నూతిగట్టు మల్లేశ్వరరావు అనే వ్యక్తి ఇంటిపై భాగంలో పిడుగు పడి గోడ దెబ్బతింది. ఇంటిలో విద్యుత్ వైర్లు, ఇన్వెర్టర్ కాలిపోయాయి.


నర్సీపట్నం రోడ్డుపై నిలిచిన నీరు


అనకాపల్లి పట్టణంలో కురుస్తున్న వర్షం

చెస్‌తో మేధాశక్తి పెంపు


విద్యార్థులకు చెస్ శిక్షణ ఇస్తున్న ప్రముఖ విద్యావేత్త కొల్లి సత్యారావు

అచ్యుతాపురం రూరల్ : చెస్ ఆడడం వల్ల మనిషి మేధాశక్తి పెరుగుతుందని ప్రముఖ విద్యావేత్త కొల్లి సత్యారావు అన్నారు. విజ్ఞాన వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా బుధవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చదరంగంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలో వ్యూ హాత్మకత, ఎత్తుకు పైఎత్తు వంటి ఆలోచనలు ద్వారా మెదడుకు మంచి కసరత్తు జరుగుతుందన్నారు. తద్వారామనస్సు,బుద్ధిచురుగ్గా పనిచేస్తాయన్నారు.

విస్తారంగా మిరప పంట సాగు


దాలివలసలో సాగులో ఉన్న మిరపచేను

కె.కోటపాడు : మిరప పంటను మండలంలో పలు గ్రామాల్లో రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. మిరపపంట సాగు కాలంలో 10 రోజులకు ఒక్కోసారి నీటి తడుపు అందించాలని, ఈ విధంగా సాగు చేపడితే మొక్కనాటిన 45 రోజులకు మిరప పంట పూతదశకు చేరుకుని దిగుబడి ప్రారంభం అవుతుందని సాగు రైతులు తెలుపుతున్నారు. తక్కువ పెట్టుబడితో స్వల్పకాలంలో మంచి లాభాలు పొందగలమని రైతులు చెబుతున్నారు. మండలంలో దాలివలస, పింద్రంగి, గవరపాలెం, డి.అగ్రహారం, లంకవానిపాలెం, మర్రివలస, శంగవరం, పాతవలస, కె.సంతపాలెం గ్రామాల్లో 90 ఎకరాల్లో మిరప పంటను సాగు చేస్తున్నారు.

'ఉపాధి పనులు పెండింగ్ పెట్టొద్దు'


ఉపాధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి: మండలంలో పలు గ్రామాల్లో గుర్తించిన ఉపాధి పనులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. లేబర్ డైలీ వేజ్, వేజ్ కాంపోనెంట్, ఫారం పాండ్స్, సోక్‌పిట్స్, హార్టికల్చర్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్, కంపోస్ట్ పిట్స్, ఇంకుడు గుంతల గురించి సమీక్ష చేశారు. జాబ్‌కార్డు కలిగిన వారందరికి పనులు కల్పించాలని ఆయన ఆదేశించారు.ఈ సమావేశంలో ఏపీవో భాగ్యలత, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.